# విచిత్రం

శైలజ రాజీవ్‌ల వివాహం సింపుల్‌గా రిజిస్టర్ మేరేజ్‌తో సరిపెట్టుకున్నారు.

మేరేజ్‌హాలు... మేళతాళాలు... డిన్నర్లు...బంధుజనం వంటి వాటి జోలికి పోతల్చుకోలేదు.

వాళ్లది ప్రేమ ప్లస్ ఆదర్శ వివాహం!

ఇద్దరి కలయిక ఒక రెస్టారెంట్లో! ఒకరితో మరొకరికి పరిచయం ఏర్పడింది! స్నేహంగ మారింది. ప్రేమ వివాహానికి దారి తీసింది.

ఒకరి గురించి మరొకరు మేరేజ్‌కి ముందే ఓపెన్‌గ మాట్లాడుకున్నారు. తనకు వివాహమైందని.. ఏడాదైన తిరక్కముందే భార్య చనిపోయిందనే నిజాన్ని శైలజకు చెప్పేడు రాజీవ్.

అతని ఓపెన్‌నెస్‌కి అభినందించింది! రెండవపెళ్లి వ్యక్తిని చేసుకోవటానికి శైలజ ఎలాంటి అబ్జక్షన్ చెప్పలేదు. అందుకే 'ఎస్స'నేసింది.

ఇద్దరూ జాబ్ చేస్తున్నారు. చెరి పాతిక వేలు సంపాదిస్తున్నారు. శైలజది సెంట్రల్ గవర్నమెంట్ సర్వీసైతే.. రాజీవ్ ఎంప్లాయ్‌మెంట్ స్టేట్ గవర్నమెంట్‌లో! అందునా సచివాలయములో!

నూతన జంట పదిరోజులు సెలవు పెట్టి సింగపూర్ హనీమూన్ ట్రిప్ వెళ్లొచ్చారు.

శైలజకు బంజారాహిల్స్‌లో అందమైన భవంతి వుంది. కారుంది. బేంక్ బేలన్సుంది. బోలెడంత ఆస్థివుంది. విధవరాలైన తల్లీవుంది.

ఈ విషయాలన్నీ ముందుగా చెప్పలేదు శైలజ తనకు కాబోయే భర్తను సర్‌ప్రైజ్ చేయాలని!

శైలజ పర్సనల్ మేటర్స్‌లోకి జొరబడే ప్రయత్నం రాజీవ్ చేయలేదు.

రాజీవ్‌కి సిటీలో డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ వుంది! స్కూటరుంది! పేరెంట్స్ లేరు. మామయ్య సంరక్షణలో పెరిగి తనకాళ్ల మీద నిలదొక్కుక్కున్న వ్యక్తి!

ఈ నిజాన్ని పూసగుచ్చినట్టు శైలజకు ముందుగానే చెప్పాడు.

స్థోమతల్లో ఇద్దరిలో అంతరమున్నా ఒకరంటే మరొకరు ఇష్టపడ్డారు.

శైలజకు మూడునాలుగు మేచెస్‌లు తాంబూలాల స్థాయి వరకూ వచ్చి

అగిపోవటంతో కొంత కాలం మానసికంగా నిరుత్సాహానికి గురైంది. అసలు పెళ్లే చేసుకోవద్దనుకుంది. కానీ.. రాజీవ్‌తో పరిచయం ఏర్పడిన తర్వాత మనసు మేరేజ్ పట్ల మొగ్గుచూపింది. అతడిని లైక్ చేసింది. సెకెండ్ మేరేజ్ వాడైనా సరే ఇష్టపడింది.

'రాజీవ్! నువ్ నీ ఫ్లాట్ రెంట్‌కిచ్చేసెయ్! మనిద్దరం మా ఇంట్లోనే వుందాం'

'తీరా శైలజతో కలిసి కార్లో వెళ్లిం తర్వాత గానీ తెలీలేదు అది ఇల్లు కాదనీ.. ఖరీదైన బంగళా అని!

'నా కన్నా నీవే వెల్దీ పర్సన్‌వి' ఠక్కున అనేశాడు.

'నేన్నీకు చెప్పకుండా ఇంకా చాలా పర్సనల్ మేటర్స్ దాచాను'

'ఈజిట్?'

'అవును. అన్నీ ఒక్కసారే చెప్తే థ్రిల్ ఏముంటుంది?

'ఎనీ ఇన్టరెస్టింగ్ ఈవెంట్స్'

'నథింగ్ స్పెషల్. నాకు విడోమదరుంది. నా దగ్గరేవుంటోంది. మా డాడీ ఆస్ట్రేలియాలో బిజినెస్ చేస్తూ చనిపోయారు. అక్కడ ప్రాపర్టీ అమ్మేసి.. డాడీ బిజినెస్ క్లోజ్ చేసి ఇండియా వచ్చేశాం! అప్పటికి నాకు పదేళ్లు! - నా ఎడ్యుకేషన్, ఎంప్లాయ్‌మెంట్ ఇక్కడే!

'వావ్!... గ్రేట్!

'మనకు మేరేజ్ జరిగేక నువ్వు మా ఇంటికి రావడం ఇదే తొలి సారి! అఫ్‌కోర్స్ మమ్మీకి మన ఎఫైర్ గురించి చెప్పాననుకో...'

శైలజ కారు డ్రైవ్ చేస్తుంటే... రాజీవ్‌ప్రక్క సీట్లో కూర్చుని మాట్లాడుతున్నాడు.

పార్టికోలో కారాపి ఇద్దరూ దిగి బంగళా లోపలికి నడిచారు.

'కుడికాలు లోపలికి పెట్టి ఇంట్లోకి రావటాలు... ఇంట్లో వాళ్లు మనల్ని గుమ్మంలోనే నిలబెట్టి హారతి ఇవ్వటాల్లాంటి ట్రెడిషన్స్‌కి నేను దూరం. మా మమ్మీకి ఇష్టం లేదు. నీకేమైనా అభ్యంతరమా డియర్...'

'నో! నాటెటాల్...'

'వావ్! మీ బంగళా అత్యద్భుతంగా.. అన్ని ఫెసిలిటీస్‌తో చాలా మోడరన్‌గా వుంది శైలూ... డిజైన్ ఇంజనీర్ ఎవరోగానీ అత్యాధునికంగా డిజైన్ చేశాడు. మార్వెలస్'... చుట్టూ పరికిస్తూ మనసులో మాట చెప్పాడు రాజీవ్.

'అంత పొగడద్దులే! ఇదంతా మమ్మీ టేస్ట్!

'శ్రావణి మేడదిగి వస్తూ రాజీవ్‌ని చూచి 'రండి అల్లుడుగారూ! ఎంతసేపైంది మీరొచ్చి...' దగ్గర కొచ్చి షేక్‌హ్యాండిచ్చి' కమాన్! కూర్చొండి' అనేసి తనూ ఎదురు సోఫాలో సెటిలైంది.

ఇంతలో 'ఆయా' వచ్చి ఆపిల్‌జ్యూస్ సర్వ్ చేసి వెళ్లింది!

'షి ఈజ్ మై మమ్మీ... శ్రావణి. ఇంట్రడ్యూస్ చేసింది.

'నైస్‌టు మీట్ యు మేమ్..' నవ్వేడు రాజీవ్.

'మీ సింగపూర్ ట్రిప్ ప్లజెంట్‌గా హేపీగా జరిగిందా-' శ్రావణి అడిగింది.

'ఎవెరిథింగ్ వాజ్ ఆల్‌రైట్ అండ్ హేపీ..' బదులిచ్చి డ్రింక్ సిప్ చేశాడు.

అత్తగారు మంచి కల్చరున్న సొసైటీ లేడీలాగా అవుపించింది రాజీవ్‌కి! అవునుమరి విదేశాలలో వుండొచ్చిన మనిషి కదా.. అనేసి తనను తానే సమాధానపరచుకున్నాడు.

'శైలూ!... రాజీవ్‌ని వెంట పెట్టుకుని మన బంగళా అంతా చూపించి!...' శ్రావణి అనటంతో నూతన వధూవరులిద్దరూ అక్కడ్నించి కదిలారు.

ఇద్దరికీ ఈడు జోడు బావుంది! జోడీ చూడ ముచ్చటగా వుంది... మనసులో అనుకుంది శ్రావణి.

మేడమీదికెళ్లి ఇద్దరు ఫ్రెష్షై బాల్కనీలో వున్న ఉయ్యాల్లో కూర్చుని ముచ్చట్లు చెప్పుకోవటంలో మునిగిపోయారు.

కాస్సేపు అయిన తర్వాత కిందికి దిగి... ప్రహరీ ముందున్న లాన్‌లో అటూ ఇటూ తిరుగాడేరు.

అప్పటికే చీకటిపడింది. ఫౌంటేన్ నీటితో పాటు రంగు రంగుల కాంతులనూ విరజిమ్ముతూ విస్మయం కలిగిస్తోంది. ఆకాశంలో మబ్బులు.. వీచే చల్లని గాలి.. బంగళా హైట్‌లో వుండటాన.. అత్యద్భుతంగా కన్పించే సిటీ... ఎంతో ఆహ్లాదకరంగా వుండటంతో తన్మయత్వం చెందాడు రాజీవ్.

సడన్‌గా రిస్ట్ వాచీ చూసుకున్న రాజీవ్ 'పదిగంటలు కావస్తోంది. లేటైతే భోజనం బావుండదు! హోటల్ భోజనం సింగిల్ నిద్ర వాడిని కదా..?'అన్నాడు.

'డోన్ట్ బి సిల్లీ!' ఇది నీకు అత్తవారిల్లు. ఇకపై మనిల్లు! నీ మకాం ఇక్కడే! బేచిలర్ లైఫ్‌ని శాశ్వతంగా మర్చిపో!..'అంటూ రాజీవ్ చేతిని తన రెండు చేతుల్లో ఇముడ్చుకుని గుండెకి హత్తుకుంది.

'అంటే...'

'మనంకల్సి డిన్నర్ చేస్తున్నాం!... ఈ రాత్రికి మనకు శోభనం..' కిలకిలా నవ్వింది.

'డోన్ట్‌బి సిల్లీ! హనీమూన్‌కి వెళ్లొచ్చాక శోభనమేమిటి.. మీనింగ్ లెస్....'

'అది సింగపూర్ హోటల్లో హనీమూన్! ఇది ఈ రాత్రికి మనింట్లో...'

ఇద్దరూ బంగళాలోకి రాబోతుండగా శ్రావణి ఎదరై' మీదే లేటు... డిన్నర్ రెడీ... కమాన్..' ఆహ్వానం పలికింది.

డైనింగ్ హాల్లో కొచ్చి టేబుల్ ముందున్న ఛైర్స్‌లో కూర్చున్నారు ముగ్గురూ! ఆయా ప్రిపేర్ చేసి డిషెస్‌లో వుంచిన అయిటమ్ సర్వ్ చేస్తోంది.

వడ్డన అయిన వెంటనే 'బాప్‌రే! ఇన్ని అయిటమ్సా?' నివ్వెర పోతూ అన్నాడు రాజీవ్.

'నీకు నచ్చినవి టేస్ట్ చేయండి రాజీవ్...' శ్రావణి అంది.

'కొత్త అల్లుడువి కదా.. నిన్ను సరిగ్గా మేపక పోతే... చూసే వాళ్లు మిమ్మల్ని ఆడిపోసుకుంటారు' అంది శైలజ చిలిపిగ.

రెండు మూడు రకాల స్వీట్స్ కన్పించటంతో తనకు ఇష్టమైన సేమ్యా పాయసం టేస్ట్‌చేశాడు రాజీవ్.

'అన్నీ తినాల్సిందే! లేకుంటే ఆడపెళ్లి వారం ఊరుకోము...' అంటూ గలగలా నవ్వింది శైలజ.

'అమ్మాయి చాలా జోలియల్‌గా మాట్లాడుతుంది రాజీవ్.. నువ్వేమి అనుకోకు' అల్లుడు ఎక్కడ చిన్న బుచ్చుకుంటాడోని శ్రావణి వడ్డించింది!

'అది చికెనఫ్రై!.. ఇది మటన్ కర్రీ... మూడవది ఫిష్... అదిగో దాని పక్కనున్నది ప్రాన్స్ పులుసు. అక్కడ గారెలు.. వాటి పక్కనే ఆవడలు.. ఇవి బాయిల్డ్ ఎగ్స్...చెప్తూనే వుంది శైలు.

'అర్థమైంది శైలూ...! హోటల్స్‌లో సర్వర్‌లాగ 'మెనూ' గడగడా వప్ప చెప్పక్కర్లేదులే..' పరిహాసంగామాట్లాడేడు రాజీవ్.

'స్టార్స్ హోటల్లో కూడా ప్రిపరేషన్స్ ఇంతటేస్టీగా వుండవ్! అన్నీ ఎక్సలెంట్‌గా వున్నాయ్' మళ్లీ రాజీవే అన్నాడు.

మరోవైపు... గుత్తి వంకాయ కూర, కంది పచ్చడి. బంగళా దుంపవేపుడు..కొత్త ఆవకాయ... బెండకాయ ఫ్రై... గడ్డ పెరుగు వుండటం చూసి విస్తు పోతూ బకాసురుడు సైతం ఇన్ని అయిటమ్స్ తిన్లేడేమో అనికున్నాడు మనసులో..

హోటళ్లోనే కాదు.. ఇళ్లల్లోనూ నాజూకు తిండికి అలవాటు పడుతున్న సామాన్యులకైనా ఇలాంటి భోజనం తినటం అసాధ్యం అన్పించక పోలేదు రాజీవ్‌కి.

ప్రయాసపడి డిన్నర్ లాగించిన రాజీవ్ ఆయాస పడటం గమనించిన శ్రావణి 'అల్లుడు గార్కి సుగంధ ద్రవ్యాలు మిళాయించిన తాంబూలం ఇవ్వు శైలూ... తిన్నది క్షణంలో అరిగి పోగలదు..'అన్నది.

'సున్నం ఎక్కువ రాయలేదుకదా? నోరు పొక్కగలదు..' శైలజ అందించిన తాంబూలం బుగ్గన పెట్టుకుని సరిగ్గా రాత్రి పదిన్నరగంటలకు శోభాయమానంగ అలంకరించి రూమ్ ఫ్రెష్‌నర్స్ స్ప్రే చేసిన తాలూకూ ఘుమఘుమలు ఆహ్వానం పలుకుతున్న క్షణంలో దంపతులిద్దరూ శోభనం గదిలోకి ప్రవేశించారు.

'ఈ హంగామా చూస్తుంటే తెలుగు సినిమాలో చూపే శోభనం గదికంటే వేయిరెట్లు అద్భుతంగాను.. మనసును మైమరపించేదిగా వుంది' అన్నాడు శైలజ బుగ్గగిల్లి.

ఇద్దరూ డబుల్ కాట్ బెడ్‌మీద వాలారు!

రాజీవ్ కళ్లకు ఒక చిత్రమైన దృశ్యం కన్పించింది. ఎదురుగా వున్న గోడకు వేలాడే ఫ్రేమ్స్ కట్టబడిన నాలుగు ఫోటోలు కంటపడినయ్. అందరూ సినిమా హీరోలకు మల్లే పడుచు ప్రాయంలో అందంగా అగుపించారు.

ఫోటోల్లో కన్పించే ఆ నలుగురూ ఎవరై వుంటారు చెప్మా అనుకున్నాడు. వారెవరైంది నోరు తెరిచి అడగటానికి డెలికసి అడ్డొచ్చింది.

చనిపోయిన మామగారే వుంటే.. బహుశ ఆయన చిన్ననాటి ఫోటో గనకే అయివుంటే చనిపోయిన వ్యక్తి ఫోటోకి దండవేస్తారు కదా! అలాంటిదేం లేదే?...పైగా నాలుగు ఫోట్లోల్లో వ్యక్తులు వేరు వేరు పోలికల్లో అనుపిస్తున్నారాయె?-ఇదేం విచిత్రం?

హు! తెలియని విషయం గురించి బుర్ర బద్దలు కొట్టుకోవటం అవివేకంగా తోచింది. రాజీవ్‌కి.

ఇంతలో రాజీవ్ ఫోటోలకేసి నిశితంగ అబ్జర్వ్ చేస్తున్నాడని గ్రహించిన శైలజ' వాళ్లున్నారే ఆ పోటోల్లో అవుపించే నలుగురూ.. మా బంధువులేంకారు.

'సినిమా హీరోలా?'

'అంత వెటకారం వద్దు. సినిమా హీరోలు కాక పోయినా.. ఆ నలుగురూ హీరోలే! ఆ నలుగురికీ నేనే ఏకైక హీరోయిన్‌ని..' ఫక్కున నవ్వింది.'

రాజీవ్ ఆ మాట వినగానే తుళ్లిపడ్డాడు.

'కాస్త అర్థమయ్యేట్టు చెప్పు శైలూ...'

'వద్దు లెండి! చెప్తే మీరు బాధపడతారు...!

'నేను గుండె నిబ్బరంగల వాడిని! చెప్పు పర్వాలేదు...'

'ఇదో పెద్ద నిజం మీకు చెప్పకుండా దాచాను ఐయామ్‌సారీ డియర్...'

'కోపమా?- భీ హేపీ డియర్! వాళ్లు నన్ను బలాత్కారం చేసిన వాళ్లూ కాదు... సామూహిక మానభంగమూ వారు చేయలేదు...'

'మధ్యలో కలుగు చేసుకుని' బీ సీరియస్. సిన్సియర్‌గ చెప్తే చెప్పు! లేకుండా అజన్మాంతం చెప్పద్దు!'

'అయితే చెప్తాను. ప్లీజ్ లిజన్! ఫోటోలో అగుపించే ఆ నలుగురూ నా పెళ్లి చూపులకని మా ఇంటికి వచ్చిన వారే... ఐ మీన్ ఒక్కసారే అనుకునేవ్! కాదు. వారి జీవితాలు అత్యంత విషాదంగా ముగిసినయ్! అదీ విశేషం!

'అంటే?...'

'కంప్లీట్‌గ వినండి! మొదటి ఫోటోలో ఆ కుర్రాడు నన్ను చూసి మురిసి మెచ్చి నేను నచ్చానన్నాడు. అందరిముఖాల్లో ఆనందం పురివిప్పింది. అతను తిరిగివెడుతూ ఇల్లు చేరుకునేలోగా రోడ్ యాక్సిడెంట్లో చనిపోయాడు! దాని పక్క ఫోటోలో ఉన్న అతను ఇంజనీర్. నన్ను చూడ్డానికి స్టేట్స్ నుండి వచ్చాడు. నచ్చానన్నాడు. తిరిగి అమెరికా వెడుతున్న విమానం యాక్సిడెంట్‌కి గురై అందరి ప్రయాణీకులతో తనూ కన్నుమూశాడు. మూడవ అతను డాక్టర్. తాంబూలాలు పుచ్చుకోబోతున్న శుభ ఘడియల్లో సడన్‌మేసివ్ హార్ట్ ఎటాక్‌తో ప్రాణాలు కోల్పోయాడు! ఇక పోతే చిట్ట చివరి ఫోటోలో వ్యక్తి రియల్ ఎస్టేట్ బిజినెస్‌లో కరోర్‌పతి! వ్యాపార సంబంధమైన కక్షల్లో ఎక్స్‌పార్టీవారు అతనిపై దాడి చేసి రేపు వివాహమనగా అతి దారుణంగా కాల్చిచంపారు.

శైలజ మాటలు విన్న రాజీవ్‌కి దిమ్మ తిరిగింది. కళ్లు బైర్లు కమ్మాయ్. దారుణమైన సంఘటనలు వింటూ నెర్వస్‌ఫీలైనాడు.

'అందుకే.. ఆర్భాటంగా పెళ్లి ... ముహూర్తాలు.. బంధువులు... విందుల జోలికి పోకుండా నిన్ను లవ్వాడి పెళ్లాడాను..' ఇప్పుడు అర్థమైందా మనిద్దరి వివాహం వెనుకగల విచిత్రం ఏమిటో? - అని చెప్తూ గలగలా నవ్వేసి రాజీవ్ కౌగిలిలో గువ్వలా ముడుచుకుంది!

-: సమాప్తం :-